క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం మండల విద్యాధికారి మాణెయ్య పరిశీలించారు. భోజనం రుచిపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటో తరగతిలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తులసి, సల్మా తదితరులు ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి: ఎంపీడీఓ యాదగిరి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మండలంలోని పలు నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవాలకు మొక్కలను సిద్ధం చేయాలని వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్, జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఐదు మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రూ. 2000, మరొకరికి రూ.1500, మిగతా ముగ్గురికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



ప్రింటర్‌ను అందజేస్తున్న రాంరెడ్డి

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ముదిమాణిక్యం ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన చార్టర్ అకౌంటెంట్ రాంరెడ్డి ప్రింటర్‌ను అందజేశారు. ఉన్నత పాఠశాల కంప్యూటర్‌కు ప్రింటర్ లేక పోవడంతో సీసీ రాంరెడ్డి ప్రింటర్ అందజేశారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కంగ్టి(నారాయణఖేడ్): రైతులందరూ తప్పనిసరిగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జమ్గి(బీ) క్లస్టర్ ఏఈఓ భార్గవ్ తెలిపారు. మండలంలోని బాన్సువాడ గ్రామంలో రైతుల ఆధార్ నంబర్లకు వచ్చే ఓటీపీతో డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డులో 11 సంఖ్యలతో ఐడీ, రైతుపేరు, ఆధార్, ఫోన్‌నంబర్, పాస్‌బుక్ వివరాలు, భూమిరకం, సర్వే నంబర్లు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేయనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన కిసాన్‌నిధి, ఫసల్‌బీమా, సాయిల్ హెల్త్ కార్డులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

పలుగుతండాలో సుదర్శన యాగం



సుదర్శన హోమంలో పాల్గొన్న సంగ్రాం

నారాయణఖేడ్: మండలం పరిధి పలుగు తండాలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సుదర్శన, చండీయాగం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, అంతర్‌గాం పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహరాజ్‌లు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఈ యాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ డీఎల్‌సీఓ పురుశార్థి, చాప్లిబాయి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై సీడీఎంఏ కార్యాలయానికి వెళ్తున్న కమిషనర్ సంగారెడ్డిను మంగళవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నూతన కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, మేనేజర్ అఖిల్, డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక తదితరులున్నారు.

మహాత్ములూ.. మన్నించండి!



అంబేడ్కర్ విగ్రహం



మహాత్మా గాంధీ



అబ్దుల్ కలాం

నాయకులు, అధికారులకు మహాత్ముల జయంతి, వర్ధంతులకు మాత్రమే వారి విగ్రహాలు గుర్తొస్తాయి. ఆరోజున పెద్ద ఎత్తున పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. మళ్లీ ఆ విగ్రహాలను పట్టించుకోరు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మహాత్ముల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మహాత్మా గాంధీ, డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్, అబ్దుల్ కలాం విగ్రహాలకు వేసిన రంగు పెచ్చులుగా ఊడిపోతున్న అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. కార్యాలయానికి వచ్చే ప్రజలు విగ్రహాలను చూసి మహాత్ములారా క్షమించండంటూ వేడుకుంటున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు

- మండలంలో ఏళ్ల తరబడి మూతపడిన ఐదు అంగన్‌వాడీలు
- ఐదు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- 12 ఆయా పోస్టులు ఖాళీ
- 32 అంగన్‌వాడీలకు భవనాలు కరువు



ఏడాదిన్నరగా మూతపడ్డ నాగుల దేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రం

హత్నూర(సంగారెడ్డి): ఉపాధ్యాయులు, ఆయాలు లేక అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడి ఏళ్లు గడుస్తున్నాయి.. అంగన్‌వాడీలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. హత్నూర మండలంలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఐదు మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పదవి విరమణ పొందగా, 12 మంది ఆయాలు కూడా పదవీ విరమణ పొందారు. నాగుల దేవులపల్లి గ్రామంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మృతి చెందడంతో రెండేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. సికిందలాపూర్ గ్రామంలో ఉపాధ్యాయురాలు, ఆయా ఇద్దరు ఒకేసారి పదవి విరమణ పొందారు. ఏడాదిగా ఈ గ్రామంలో అంగన్‌వాడీ మూతపడడంతో పిల్లలు ప్రైమరీ పాఠశాలకు వెళ్లినప్పటికీ ఇబ్బందులు తలెత్తుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లమాచునూరు గ్రామంలో ఉపాధ్యాయురాలు ఆయా సైతం పదవి విరమణ పొందారు..ఇక్కడ కూడా ఏడాదిగా అంగన్‌వాడీ నడవడం లేదు. చిక్ మద్దూర్‌లో ఏడాది క్రితం ఉపాధ్యాయరాలు బదిలీపై కొన్యాల వెళ్లింది. ఆయా పదవి విరమణ పొందింది. దీంతో ఇక్కడ కూడా అంగన్‌వాడీ కొనసాగడం లేదు. చింతల్చెరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం 1 ఉపాధ్యాయురాలు ఆయా ఇద్దరు ఏడాది క్రితం పదవి విరమణ పొందారు. దీంతో ఇక్కడ పాఠశాల చదువుతున్న విద్యార్థులు ఇతర అంగన్‌వాడీ కేంద్రానికి పంపించారు. మండలంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల చిన్నపిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణీలు, పిల్లలు, బాలింతలకు ప్రతినెలా ఇచ్చే పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతర గ్రామాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నెలకు ఒకసారి వచ్చి గుడ్లు పౌష్టికాహారం అందిస్తున్నప్పటికీ సక్రమంగా అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

32 కేంద్రాలకు సొంత భవనాలు కరువు

మండలంలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కేవలం 24 అంగన్‌వాడీలకు మాత్రమే భవనాలు ఉన్నాయి. 32 కేంద్రాలకు సొంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 15 అద్దె భవనాలలో అంగన్వాడీలు కొనసాగుతుండగా మరో 17 అంగన్వాడీ కేంద్రాలు పలు గ్రామాలకు చెందిన గ్రామస్తులే ఉచితంగా భవనాలను సమకూర్చారు. ఏది ఏమైనా ఉపాధ్యాయుల కొరత ఆయాల కొరతతో పాటు భవనాలు లేక కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడాదిగా మూతపడింది



సికిందలాపూర్ గ్రామంలో ఏడాది క్రితం ఉపాధ్యాయురాలు, ఆయా, పదవీ విరమణ పొందారు..అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు చిన్నపిల్లలు ప్రైమరీ పాఠశాలలకు వెళితే అక్కడ ఇబ్బంది అవుతుంది. ఇప్పటికైనా అధికారులు అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించి ఆయా, ఉపాధ్యాయులను నియమించాలి.

– శ్రీకాంత్, సికిందలాపూర్

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



ఉపాధ్యాయురాలు, ఆయాల ఖాళీలను ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అధికారులు ఖాళీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వగానే భర్తీ చేస్తాం. మూతపడిన కేంద్రాల్లో ప్రతినెల పౌష్టికాహారం అందిస్తున్నాం. అంగన్‌వాడీ భవనాలు లేని కేంద్రాల వివరాలు కూడా అందించాం.

– సంధ్యారాణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ



తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని సంగుపేటలోని వ్యవసాయ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు వివరాలు, సౌకర్యాలను ప్రిన్సిపాల్ స్పందనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో తరగతి గదులు, హాస్టల్ రూంలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. ప్రస్తుతం వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో పాండు, కళాశాల ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన జరగాలి

సంగారెడ్డి : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరగాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ, యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు . అనంతరం జేఎన్టీయూ సుల్తాన్పూర్ కళాశాలలో జవహర్ నవోదయ విద్యాలయం సంబంధించి తాత్కాలిక ఏర్పాట్లను పర్యవేక్షించారు . ఆయన వెంట మండల విద్యాధికారి బాలయ్య సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాజారాం తండా చౌరస్తాలో ఎస్ఐ దుర్గారెడ్డి సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆటోలు, కార్లు, బైక్‌లకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. వాహనాల్లో తరలిస్తున్న సామగ్రిని పరిశీలించి ప్రభుత్వం నిషేధించిన పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పండరి, గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్నికకు మారుపేరు భారతి సిమెంట్

సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్



ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న శివకుమార్

పటాన్‌చెరు టౌన్: మన్నికకు మారుపేరు, సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ అన్నారు. మంగళవారం అమీన్‌పూర్‌లోని శివ పార్వతీ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీమేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీల కు రూ. 1 లక్ష ప్రమాద బీమా బాండ్లను అందచేశారు. అనంతరం డీలర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలియచేశారు.

రైతులకు ఎరువుల పంపిణీ

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని గుంతపల్లికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పడమటి అనంత్‌రెడ్డి రైతులకు ఉచితంగా ఎరువులు పంపిణీ చేశారు. గ్రామంలోని 400 రైతు కుటుంబాలకు రూ.20 లక్షల సొంత నిధులతో ప్రస్తుతం అవసరమయ్యే అడుగు మసాల బస్తాలను (డీఏపీ) పంపిణీ చేశారు. అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎరువులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



మొక్కలను పంపిణీ చేస్తున్న అంజిరెడ్డి, గోదావరి

పటాన్‌చెరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ దేవస్థానం ఆవరణలో వికసిత్ భారత్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన నేపథ్యంలో అమ్మ పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అధ్యక్షతన మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి , మహిళా మోర్చా మీనాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ఆర్డీఓ రవీందర్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): భూముల సర్వే కోసం అర్జీలు పెట్టుకున్న రైతుల భూములను ఆలస్యం చేయకుండా సర్వేలు నిర్వహించి రికార్డులను అందజేయాలని ఆర్డీఓ రవీందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కందిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం చేయొద్దన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిపై అధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అలాగే, కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. అంతకుముందు కందిలోని రైతు వేదికలు నిర్వహించిన ముఖ్యమంత్రితో టెలికాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, సర్వేయర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నాలా పరిశీలన



నాలాను పరిశీలిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలోని లక్ష్మీనగర్‌లో నాలాపై నిర్మిస్తున్న కట్టడాలను మంగళవారం పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలాలపై ఇల్లు నిర్మిస్తే వర్షాకాలంలో ఇళ్లలోకి చేరే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సహకారంతో నాలాలపై నిర్మించే కట్టడాలను అరికట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మజహార్, కంది ఈఓ కవితతోపాటు బిల్ కలెక్టర్ మల్లేశం, వీరాజు పాల్గొన్నారు.

గెలుపునకు పాటుపడాలి

నారాయణఖేడ్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పాటుపడాలన్నారు. పుల్కుర్తి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నోట్ పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

రైతుల సంబురాలు

రైతు భరోసా నిధులు ఖాతాలో జమ కావడంతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరుపుకొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తమ ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేసిందని రైతుల హర్షం వ్యక్తం చేశారు. పలు చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి, సోనియా గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు.



నారాయణఖేడ్: నాయకులకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రైతులు



బాణాసంచా కాలుస్తున్న రైతులు, నాయకులు



రాయికోడ్: ర్యాలీలో పాల్గొన్న అంజయ్య



ఝరాసంగం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

డీఎస్పీ ప్రభాకర్



పటాన్‌చెరు టౌన్: కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనమవుతుందని, వాటి నివారణకు సమష్టిగా కృషి చేయాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రారం తోషిబా పరిశ్రమలో కార్మికులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్రమైన పరిణామాలను ప్రస్తావిస్తూ, హానికరమైన ప్రభావాలను వివరించారు. విద్యార్థులు, యువత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని తెలిపారు. మాదకద్రవ్య రహిత దేశాన్ని నిర్మించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తోషిబా అడ్మిన్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిదాం

జిన్నారం (పటాన్‌చెరు): మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. చిన్న వయసులోనే మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి సీఐ మొక్కలు నాటారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జహీరాబాద్ టౌన్: చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం మొగుడంపల్లి గిరిజన బాలికల గురుకులంలో మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగహన కల్పించారు. మత్తు పదర్థాల వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు.

సరైన జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

మునిపల్లి(అందోల్): సరైన జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలని బుదేరా ట్రైనింగ్ ఎస్ఐ హారిక పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బుదేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు యాంటి డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హారిక మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంపై కలిగే నష్టాపై అవగాహన కల్పించారు.

అవగాహనతోనే నివారణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అవగాహనతోనే మాదకద్రవ్యాల నివారణ సాధ్యమని తహసీల్దార్ సరస్వతి అన్నారు. మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, యువకులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై సీఐ మహేశ్‌గౌడ్ కలిసి అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.